విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 27, ఆగస్టు 2025

సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులుగా సంజీవప్ప

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ (క్రమ శిక్షణ కమిటీ) సభ్యుడిగా కళ్యాణదుర్గానికి చెందిన ప్రముఖ న్యాయవాది, పార్టీ సీనియర్ నాయకుడు ఎం.డి.సంజీవప్ప ఎన్నికయ్యారు. మాజీ ఎమ్మెల్సీ జెల్లీ విల్సన్ చైర్మన్‌గా 9 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అందులో కళ్యాణదుర్గం నుండి రెండవసారి పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడిగా సంజీవప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీలో నిర్మాణ సమస్యలపై, ఆర్థిక క్రమ శిక్షణపై వచ్చే ఫిర్యాదులను విచారణ చేసి రాష్ట్ర కార్యవర్గానికి నివేదిస్తే తధానుగుణంగా రాష్ట్ర పార్టీ వాటిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందని సంజీవప్ప తెలిపారు. ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించగలనని, రాష్ట్ర పార్టీకి ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం..

టీడీపీ విస్తృత సమావేశంలో మంత్రుల పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: అనంతపురం పట్టణం ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన అనంతపురం పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్థిక మంత్రి శ్రీ పయ్యావుల కేశవ్ , త్రిసభ్య కమిటీ సభ్యులు మంత్రి డోలా వీరాంజనేయ స్వామి, అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు .. అనంతపురం పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, రాష్ట్ర కమిటీ నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఈ సమావేశం ద్వారా పార్టీ బలోపేతానికి, ప్రజలకు మరింత చేరువ కావడానికి అవసరమైన నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల వీరాంజనేయ స్వామికి అనంతపురం పార్లమెంట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ముఖ్యంగా పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఎస్సి సంక్షేమ హాస్టల్ అభివృద్ధి, కార్యక్రమాలకు ప్రత్యేక నిధులు ఇవ్వాలని కోరారు. అలాగే ఎస్సి విద్యార్థుల వసతి దగ్రుహాలలో అదనంగా కొత్త భవనాలు ఏర్పాటు,మౌలిక సదుపాయాల కోసం నిధులు ఇవ్వాలని ఎంపి, ఎమ్మెల్యేలు మంత్రి వీరంజనేయ స్వామిని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనడం విశేషము.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా బి.గోవింద్ ఎన్నిక

విశాలాంధ్ర-గుంతకల్లు: సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులుగా బి.గోవింద్‌ను నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం తీర్మానం చేసింది. 1978 సంవత్సరంలో గోవిందు సీపీఐ పార్టీలో చేరారు. 1980లో సభ్యత్వం తీసుకున్న తర్వాత మొట్టమొదటి సారిగా సినిమా వర్కర్స్ ట్రేడ్ యూనియన్ లో జనరల్ సెక్రెటరీగా ఎన్నికై అంచలంచెలుగా పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడిగా 2005- 2006 వరకు పనిచేశారు. కార్మిక వర్గానికి నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ఉద్యమమే ఊపిరిగా ముందుకు సాగారు. ఆయన సేవలను గుర్తించి 2007వ సంవత్సరంలో సిపిఐ గుంతకల్లు మండల కార్యదర్శిగా ఎన్నుకున్నారు. .ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజా ఉద్యమాలు చేస్తూ ఎంతోమందికి ఇల్లు లేని నిరుపేదలకు భూ పోరాటం చేసి వారికి స్థలం ఇప్పించి పట్టాలు ఇప్పించిన ఘనుడు కామ్రేడ్ గోవింద్. 2008 -2009 సంవత్సరంలో సీపీఐ జిల్లా పార్టీ గుర్తించి గుంతకల్ నియోజకవర్గ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి నియోజకవర్గ ప్రజలకు బాధ్యతతో నిబద్ధతతో సేవలందించారు. నిజాయితీతో పార్టీ నిర్ణయాలకు కట్టుబడి నిత్యం పార్టీ కోసం పనిచేస్తానని ఆయన చెప్పారు.

ఇంటి నిర్మాణం చేపట్టని లబ్ధిదారులకు నోటీసులు..

విశాలాంధ్ర-గుంతకల్లు : గత ప్రభుత్వాలలో స్థలం పట్టా పొంది ఇంటి నిర్మాణం చేపట్టని లబ్ధిదారులకు తహసీల్దార్ రమాదేవి నోటీసులు జారీ చేశారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ డిసెంబర్ ఆఖరిలోపు ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకోవాలని లేనిపక్షంలో పట్టాలను రద్దు చేస్తామన్నారు. మధ్యంతర నిర్మాణంలో ఉన్నవారు ఇంటి నిర్మాణం పూర్తి చేయకపోయినా రెవెన్యూ యాక్ట్ నిబంధనల మేరకు హౌసింగ్ ద్వారా పొందిన రుణాలు రికవరీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మమ్మల్ని మోసం చేయొద్దు ..

విశాలాంధ్ర-శింగనమల : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట మంగళవారం మ్యాన్సీ ఫెర్రర్ విభిన్న ప్రతిభావంతుల మండల సమాఖ్య నాయకులు నారాయణ, ఆదినారాయణ, ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేము ఏమాత్రం చేతకాలని వారమని.. ప్రభుత్వం.. డాక్టర్లు వికలత్వం శాతాన్ని తగ్గించి మమ్మల్ని నట్టేట ముంచారని, తక్షణమే రీ వెరిఫికేషన్ చేయించి పింఛన్లు పునరుద్ధరించాలని కోరారు. ఎంపీడీవో భాస్కర్‌కు వినతిపత్రం సమర్పించారు, ఆయన సానుకూలంగా స్పందిస్తూ ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సావిత్రి, కార్తీక్, సోమనాథ్,నరేంద్ర, రంగమ్మ, మునేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణేశ్నవరాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర-ఉరవకొండ: ప్రశాంతంగా గణేశ్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలని తహసీల్దార్ మహబూబ్ బాషా సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లపై ఉరవకొండ సిఐ మహానందితో కలిసి వివిధ ప్రభుత్వ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణ, గణేష్ మండపాలకు విద్యుత్ సరఫరా, నిమజ్జనం పాయింట్ల వద్ద ఏర్పాట్లు తదితర అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. ఉత్సవ కమిటీ సభ్యులు కూడా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఎంపీడీవో రవి ప్రసాద్, గ్రామ కార్యదర్శి గౌస్ సాహెబ్, ట్రైనీ ఎస్సై అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు..

విశాలాంధ్ర-బెలుగుప్ప: గొంతునొప్పి, దగ్గు, జలుబు, జ్వరం తదితర రోగాల నుండి ముందస్తు జాగ్రత్తగా విద్యార్థులకు డాక్టర్ కార్తీక్ రెడ్డి, రమణ, పద్మావతి, సరోజమ్మలు వైద్య పరీక్షలు చేశారు. కేజీబీవీ పాఠశాల ఎస్ఓ నాగరత్నబాయి అదే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన ఏఎన్ఎం రాధమ్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీతో జిప్సమ్

విశాలాంధ్ర- శింగనమల : మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రానికి మంగళవారం 30 టన్నుల జిప్సమ్ స్టాక్ వచ్చిందని జిప్సం అవసరం ఉన్న రైతులకు ఉన్నతాధికా రుల ఆదేశాల మేరకు 28.6 శాతం రాయితీపై త్వరలో పంపిణీ చేస్తామని మండల వ్యవసాయాధికారి అన్వేష్ కుమార్ తెలిపారు.50 కేజీల జిప్సమ్ బస్తా పూర్తి ధర 262.2 రూపాయలు, రాయితీ రూ.75లు పోను రూ.187.2 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రాయితీపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే పంపిణీ చేయబడుతుందని, జిప్సం కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

కొర్రకోడు సర్పంచ్ ఔదార్యం

విశాలాంధ్ర-కూడేరు: మండల పరిధిలోని కొర్రకోడు గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్ తన కుమారుడు. రామన్స్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా కొర్ర కోడులోని. పారిశుధ్య కార్మికులకు నిత్వవసర. సరకులు పంపిణి చేశారు.

దివ్యాంగులకు అన్యాయం జరిగితే ఊరుకోం

సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-కణేకల్లు: దివ్యాంగులకు అన్యాయం జరిగితే సహించేది లేదని సీపీఐ మండల కార్యదర్శి ఎంగౌస్ పీర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో గత ప్రభుత్వాలు వికలాంగులకు పింఛన్ రూ.3000 నుండి రూ.4000 ఇచ్చారని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి వికలాంగులకు పింఛన్ పెంచి 6000 వేలు రూపాయలు ఇస్తున్నారు పేర్కొన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపట్టిన సదరం పరీక్షల పేరుతో డాక్టర్లతో ప్రతి వికలాంగులకి ఆసుపత్రి కి పిలిపించుకొని వారికి పర్సంటేజ్ లేదని డాక్టర్లు నోటీసులు జారీ చేయడం దారుణమని పేర్కొన్నారు. గతంలో వారి అందరికీ ప్రభుత్వ డాక్టర్లే కదా సర్టిఫికెట్ ఇచ్చింది.. మరి ఆ రోజు సదరం టెస్టులు చేయకుండా లంచాలు తీసుకొని వికలాంగుల సర్టిఫికెట్ ఇచ్చిన అలాంటి డాక్టర్లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రతి అర్హులైన వికలాంగులకు తక్షణమే వారి పింఛన్లను వారికి అందించాలని కోరారు. వీరికి న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున నిరాహార దీక్షలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి ముల్లా శర్మాస్ వలి, పట్టణ కార్యదర్శి అన్వేష్, ఏపీ మహిళా సమైక్య మండల కార్యదర్శి ఎస్.ఆబిదాబి, మండల సహాయ కార్యదర్శి ముల్ల సర్మాస్ బి.అధ్యక్షురాలు పి.హసీనా పాల్గొన్నారు.

వినాయక మండపానికి డెకరేషన్ చేస్తుండగా అపశృతి

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

విశాలాంధ్ర-శింగనమల : పుట్లూరు మండలం కోమటికుంట గ్రామంలో సోమ వారం రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో కోమటికుంట్ల గ్రామం రామా లయం వద్ద వినాయక మండపానికి డెకరేషన్ లైట్స్ అమర్చుతున్న సమయంలో విద్యుత్ షాక్ తగిలి, సాయినాథ్ కుమారుడు పసుపులేటి రాజేష్ 18 ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి క్రింద పడిపోయాడు. అక్కడున్న వారు వెంటనే చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు పరిశీలించి మృతిచెందినట్లు ధృవీకరించారు. రాజేష్ తాడిపత్రిలో ప్రైవేట్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మదర్ థెరిసాకు ఘన నివాళులు..

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉరవకొండలో మదర్ థెరీసా 115వ జయంతి వేడుకలను మంగళవారం రోడ్లు భవనాల అతిథి గృహంలో దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసే నివాళులర్పించారు. దళిత హక్కుల పోరాట సమితి నాయకులు మీనగా గోపాల్, చాబాల సర్పంచ్ మల్లెల జగదీష్ మాట్లాడుతూ ప్రేమ, దయ, సేవ అనే మూల్యాలను పాటిస్తూ.. జీవితమంతా పేదలకు, అనాథలకు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి అండగా మదర్ తెరిసా నిలిచారని కొనియాడారు. ఆమె గొప్ప ఆశయాలను ప్రతి ఒక్కరూ కూడా అలవర్చుకోవాలన్నారు. దళిత ప్రజా సంఘాల నాయకులు లత్తవరం చంద్రశేఖర్, చిన్న మూస్తూరి, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-యాడికి : స్థానిక రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో మదర్ తెరిసా 115వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఆశ్రమ నిర్వాహకులు బత్తుల ప్రసాద్ మాట్లాడుతూ, మదర్ థెరిస్సా చేసిన సేవలను కొనియాడారు. ఆమె జీవితంలో నిరంతరం ప్రేమ, కరుణ, దయ పంచేందుకు అంకితమయ్యారని పేర్కొన్నారు. ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న" అనే సందేశంను గుర్తుచేసుకుంటూ, ఆశ్రమంలో ఆమె చిత్రపటానికి పాలాభిషేకం, నిరాశ్రయులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో

విశాలాంధ్ర-గుత్తి: స్థానిక ఫుట్‌బాల్ క్రీడ మైదానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో పెన్షనర్స్ అసోసియేషన్ కోశాధికారి జెన్నే కుల్లాయి బాబు, సెక్రెటరీ రామ్ మోహన్ ఆధ్వర్యంలో మంగళ వారం మదర్ థెరిస్సా 115వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్ థెరిసా చిత్ర పటానికి కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, జాయింట్ సెక్రటరీ లక్ష్మి నారాయణ రెడ్డి పూల మాల వేసి నివాళు లర్పించారు.కుష్టు రోగులు, అనాథలకు సేవచేసి రామన్ మెగాసేసే శాంతి బహుమతి, నోబెల్ శాంతి బహుమతి తో సహా అనేక అవార్డులను అందుకున్నారని కొని యాడారు. సెక్రెటరీ రామ్ మోహన్,షైక్షా వలి,ఫక్రుద్దీన్, నారాయణరెడ్డి,చెన్నారెడ్డి, లక్ష్మి నారాయణ రెడ్డి, దేవదాస్, గోవిందప్ప, నారాయణశెట్టి పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే ఉపయోగించండి..

కలెక్టర్ వినోద్ కుమార్.వి

విశాలాంధ్ర-అనంతపురం: మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ఉపయోగించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ పిలుపునిచ్చారు. మంగళవారం అనంతపురం నగరంలోని రాంనగర్ లో ఉన్న ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపిపిసిబి) ప్రాంతీయ కార్యాలయం సమీపంలో మట్టి వినాయకుడిని పూజిద్దాం - పర్యావరణాన్ని రక్షిద్దాం అంటూ నిర్వహించిన పర్యావరణ అనుకూల వినాయక చవితి అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఉచితంగా మట్టి వినాయకులను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రజలు మట్టి గణేష్ విగ్రహాలను మాత్రమే ఉపయోగించాలని మరియు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నివారించాలని కోరారు. ఎందుకంటే అవి నీటి వనరులను కలుషితం చేస్తాయని, పర్యావరణ పరిరక్షణలో వ్యక్తుల పాత్రను కూడా వివరించారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి మట్టి గణేష్ విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయడంలో ఏపిపిసిబి చొరవను అభినందించారు. ఏపిపిసిబి పర్యావరణ ఇంజనీర్ బివై.ముని ప్రసాద్ మాట్లాడుతూ రామ్ నగర్ లోని ఏపిపిసిబి ప్రాంతీయ కార్యాలయం సమీపంలో స్టాల్ ఏర్పాటు చేసిందని మరియు ప్రజలకు అవగాహన కల్పించడానికి ఏపీపీసీబీ సుమారు 3,000 మట్టి గణేష్ విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరికుమార్, ఏపిపిసిబి అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనాలను ఏర్పాటు చేయండి

మంత్రికి ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ వినతి

విశాలాంధ్ర-శింగనమల: శింగనమల నియోజకవర్గం వ్యాప్తంగా అంబేద్కర్ భవనాలు ఏర్పాటుకు కృషి చేయాలని, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరంజనేయ స్వామి ని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శింగనమల నియోజకవర్గం కేంద్రం, బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో అంబేద్కర్ భవనాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని ఎస్సిల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేక నిధులు ఇవ్వాలని కోరారు. ఎస్సి విద్యార్థుల వసతి గృహాలలో అదనంగా కొత్త భవనాలు ఏర్పాటు,మౌలిక సదుపాయాల కోసం నిధులు ఇవ్వాలని తెలిపారు. ఎమ్మెల్యే వినతికి మంత్రి వీరంజనేయ స్వామి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

600 మట్టి వినాయక విగ్రహాల పంపిణీ..

విశాలాంధ్ర-పామిడి : మట్టి వినాయకుడిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదామని చిరంజీవి రెడ్డి అన్నారు. పామిడి పట్టణంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం 600 మట్టి వినాయకుని విగ్రహాలను విద్యార్థులకు, స్థానికులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితికి మట్టితో చేసిన విగ్రహాలే పూజించాలని కోరారు. రంగులతో చేసిన విగ్రహాల వల్ల పర్యావరణానికి నీరు కలుషితం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణేష్ ఉత్సవ కమిటీ కార్యదర్శి జోజోడే కుమార్, ఆర్యవైశ్య గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు రామ్మోహన్, పామిడి బీజేపీ మండల కన్వీనర్ అంజి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వినాయక చవితి.. కిక్కిరిసిన నార్పల మార్కెట్లు

విశాలాంధ్ర-నార్పల : పార్వతీ పారమేశ్వరుల ప్రాణ పుత్రుడు, గణనాథుడు నేడు వాడవాడలా కొలువుదీరనున్నాడు. ఉండ్రలయ్యాకు దండాలు పెడుతూ నిత్య పూజలు అందించేం దుకు భక్తులు సమాయత్తమయ్యారు. వినాయక చవితి సందర్భంగా మార్కెట్లు సందడిగా మారాయి. విభిన్న రూపాల్లో వినాయక విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. వీధి వ్యాపారులు పూజా సామగ్రితోపాటు పూలు, పండ్ల దుకాణాలను ఏర్పాటు చేశారు.భారీ విగ్రహాలను కొనుగోలు చేసి ప్రత్యేక వాహనాల్లో తరలిస్తున్నారు. నార్పల ఎస్సై సాగర్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

ఏకదంతుడి ఆశీర్వాదంతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. విఘ్నాలకు అధిపతి వినాయకుడని, ఏ కార్యక్రమం చేపట్టినా తొలిపూజ అందుకునేది గణనాథుడేనని పేర్కొన్నారు. గణేశ్ ఉత్సవాలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ సంతోషంగా పండగ జరుపుకోవాలని కోరారు.

యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు

విశాలాంధ్ర-కణేకల్లు: వరి సాగు చేస్తున్న రైతులు అవసరమైన యూరియా అందకపోవడంతో కష్టాల్లో కూరుకుపోయారని ఎమ్మార్పీఎస్,హెచ్ ఉమ్మడి జిల్లా ప్రచార కార్యదర్శి హెచ్,నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మంగవారం విలేకరులతో మాట్లాడుతూ రాయదుర్గం నియోజకవర్గంలో కనేకల్, బొమ్మనహాళ్ మండలాల్లో ప్రధానంగా వరి ఎక్కువగా పండిస్తారని, అయితే అవసరమైన యూరియా అందకపోవడం వల్ల రైతులు వరి సాగు చేయాలా వద్దా అనే సందిగ్ధంలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని రోజుల క్రితం వచ్చిన యూరియాను ఒక రైతుకు కేవలం రెండు ప్యాకెట్లు మాత్రమే ఇవ్వడం రైతులకు మరింత సమస్యగా మారిందని తెలిపారు. ఎకరా వరి సాగు చేస్తున్న రైతు, ఐదు ఎకరాల వరి సాగు చేస్తున్న రైతు ఇద్దరికీ సమానంగా రెండు ప్యాకెట్లు మాత్రమే ఇవ్వడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ హెచ్ నాగరాజు ఆధ్వర్యంలో లాలు ప్రసాద్, సమర, టిసి మారెన్న, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అర్హత ఉండి పింఛన్లు తొలగించడం దారుణం

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వైసీపీ మండల కన్వీనర్ సంజీవ రాయుడు ఆధ్వర్యంలో మంగళవారం అర్హులైన వికలాంగులకు పెన్షన్లు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం సంజీవ రాయుడు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి అర్హత ఉండి పింఛన్లు పొందుతున్న వికలాంగులకు పెన్షన్ అర్హత లేదంటూ తొలగించడం చాలా దారుణమని.. పెన్షన్‌పై ఆధారపడి బతికే వికలాంగులు ఎలా బతకాలని కన్నీరు మున్నీరు అవుతున్నారని పేర్కొన్నారు. మంచి మనసుతో ఒకటికి రెండుసార్లు వారి అర్హతను పరిశీలించి న్యాయం చేయాలని ఏఓ నాగేశ్వర్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. న్యాయం జరిగే వరకూ వైసీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా వికలాంగుల విభాగం అధ్యక్షులు ఉపేంద్ర గౌడ్, తాడిపత్రి నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు శివ ప్రసాద్, నాయకులు చందన వెంకటరామిరెడ్డి, పాల్గొన్నారు.

కుంగిన నూతుమడుగు బ్రిడ్జి

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం : కంబదూరు మండలం నూతిమడుగు పెన్నా నదిపై నిర్మించిన బ్రిడ్జి కుప్పకూలింది. వాహన రాకపోకలకు ఇబ్బంది గా మారింది. బ్రిడ్జికి ఒక వైపు వాహనాలు వెళ్లడానికి అవకాశం.ఉన్నా...ఎదురెదురుగా వాహనాలు వస్తే ప్రమాదాలు జరుగుతాయని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఈ బ్రిడ్జి కి నిలువెల్లా రంధ్రాలు పడి ప్రమాదంగా మారింది. ధర్మవరం, కళ్యాణదుర్గం ప్రధాన రహదారి కావడంతో రాత్రి సమయాల్లో వాహనదారులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఆర్ అండ్ బి శాఖ అధికారులు చొరవ తీసుకుని కుంగిన బ్రిడ్జి మరమ్మతులు చెయ్యాలని వాహనదారులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

విశాలాంధ్ర-అనంతపురం : ఆర్ట్స్ కాలేజీలో పర్యావరణ పరిరక్షణ, పౌర అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మట్టి వినాయక విగ్రహాలు, వస్త్ర సంచులను ఉచితంగా పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. పద్మశ్రీ ఆధ్వర్యంలో, వైస్ ప్రిన్సిపాల్ డా.సహదేవుడు ఏ.ఓ వెంకటరమణ, బోటనీ విభాగాధిపతి శ్రీదేవి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త విష్ణుప్రియా, మహిళా సాధికారత సెల్ ఇన్‌ఛార్జ్ డా. బృందా, ఆర్ఆర్సీ సమన్వయకర్త గిరిధర్ మాట్లాడుతూ... పర్యావరణానికి మిత్రమైన మట్టి గణేశ విగ్రహాలను వినియోగించుకోవాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి వస్త్ర సంచులను ఉపయోగించాలని కోరారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఫణిరాజ్, వెంకట సాయి, సమీరా, అజయ్ కుమార్, చంద్రశేఖర్, శ్రీకాంత్, భరత్ సాయి వర్ధన్ పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో స్వర్ణం

విశాలాంధ్ర-అనంతపురం: కాకినాడలో ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగిన ఆంధ్రప్రదేశ్ స్పీడ్ స్కేటింగ్ ఓపెన్ ఛాం పియన్ షిప్‌లో అనంతపురం మారుతినగర్‌కు చెందిన హరికృష్ణ, మమతల కుమారుడు చిన్నారి నాగోతి నిహాల్ స్వర్ణం పతకం సాధించాడు. ఈ సందర్భంగా మాక్ అకాడమీ చీఫ్ కోచ్ నాగేంద్ర అభినందించారు. మిత్రులు నాగ రంగయ్య, శ్రీనివాసులు నాయుడు మరియు పలువురు ప్రముఖులు అభినందించారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఉరవకొండ జూనియర్ సివిల్ జడ్జి దుర్గా కళ్యాణి

విశాలాంధ్ర-ఉరవకొండ: మహిళలు, బాలికలు నూతన చట్టాల పై అవగాహన కలిగి ఉండాలని, మహిళలు ఒంటరిగా ఆటోలలో, బస్సులలో ప్రయాణిస్తున్నపుడు ఏదైనా అనుమానంగా అనిపిస్తే అప్రమత్తంగా ఉండాలని డయల్ 100ను సంప్రదించాలని ఉరవకొండ జూనియర్ సివిల్ జడ్జ్ డి. దుర్గా కళ్యాణి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని రాకెట్ల, కౌకుంట్ల గ్రామాలలో న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ బాల కార్మికులు, నిర్బంధ కార్మికులు, బాలికలు మహిళల పై జరుగుతున్న లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, పిల్లల పై లైంగిక వేధింపులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, యాంటీ ర్యాగింగ్, సైబర్ క్రైమ్స్, డ్రగ్స్, ఈవ్ టీజింగ్ లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు పలు జాగ్రత్తలు పాటించి ధైర్యంగా ముందుకు సాగాలన్నారు.

నిమజ్జనం రోజు మద్యం షాపులు మూసివేయండి

విశాలాంధ్ర-తాడిపత్రి: వినాయక నిమజ్జనం రోజు మద్యం షాపులను మూసివేయాలని జైశ్రీరామ్ భక్తమండలి అధ్యక్షుడు నిచ్చెనమెట్ల రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణంలోని శ్రీరాములు పేటలోని తన గృహంలో నిచ్చలమెట్ల రాధాకృష్ణ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డిఏ కూటమి ప్రభుత్వం వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ అందించడం చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించదగిన అంశం అన్నారు. ఉచిత విద్యుత్ అందించినందుకు జైశ్రీరామ్ భక్తమండలి తరఫున సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. అదేవిధంగా తాడిపత్రి పట్టణంలో శుద్ధ పౌడర్ (గంధం పౌడర్) ను వ్యాపారస్తులు అమ్మకుండా కఠిన చర్యలు తీసుకుంటున్న ఏఎస్పి రోహిత్ చౌదరికి, పట్టణ సీఐ సాయి ప్రసాద్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

విగ్రహాలు ఏర్పాటు చేసి కొంతమంది భగవంతుని ఎదురుగా మద్యం, మాంసం భుజిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇటువంటి చర్యలను వినాయక ఉత్సవ కమిటీలు అరికట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాం. నిమజ్జనం రోజు పురవీధులలో విద్యుత్ అధికారులు ఎలక్ట్రికల్ తొలగించాలన్నారు. నిమజ్జనంలో మద్యం, గంజాయి సేవించే వారిపై పోలీసు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైశ్రీరామ్ భక్తమండలి సభ్యులు ప్రతాప్ రెడ్డి, నరసింహారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రమణ, అప్ప లక్ష్మీనారాయణ, చంద్రమౌళి పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com కర్నూలు, బుధవారం 27, ఆగస్టు 2025

ఉద్యాన పంట సేడ్ నెట్ హౌస్ పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర–తనకల్లు: కలెక్టర్ టీఎస్ చేతన్ మంగళవారం సి.ఆర్.పల్లి గ్రామంలో రైతు విజయకుమార్ రెడ్డి పండించిన కీరదోస పంట సెడ్ నెట్ హౌస్‌ను పరిశీలించారు. ఉధ్యాన పంటలు విస్తృతంగా సాగు చేస్తే రైతులకు అధిక లాభాలు వస్తాయని సూచించారు. అనంతరం చౌడేశ్వరి రైతు ఉత్పత్తిదారుల సంఘం గోడౌన్‌ను పరిశీలించి రైతులకు ఉపయోగపడేలా మల్చాలని సూచించారు. తనకల్లు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్, ఎక్స్‌రే, ఆపరేషన్ థియేటర్, వార్డులు, ఆరోగ్యశ్రీ కౌంటర్, ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణంలో గల నూతన భవనాలను పరిశీలించారు. పేషెంట్ల సమస్యలు, వైద్య సేవల లభ్యతపై సూపరింటెంట్ డాక్టర్ విజయబాబు వద్ద వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులతో, వారి బంధువులతో మాట్లాడి వైద్యసేవలపై అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ నరసయ్య, ఉధ్యాన శాఖ డీడీ చంద్రశేఖర్, సూపరింటెంట్ డాక్టర్ విజయ భాస్కర్ నాయక్, ఆర్ఐ అశోక్, డిపిఎం రామ్మోహన్, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షురాలు సరోజమ్మ, పాల్గొన్నారు.

వినాయక చవితి శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో–శ్రీ సత్యసాయి : గణపతి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యంతో నిండాలని రాష్ట్ర బిసి శాఖ మంత్రి సవితమ్మ, రాష్ట్ర వైద్య, సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ టీ.ఎస్.చేతన్..లు సంయుక్తంగా ఆకాంక్షించారు. ఈ నెల 27న "వినాయక చవితి" పర్వదినాన్ని పురస్కరించుకుని... వారు మంగళవారం ఒక ప్రకటనలో.. జిల్లా ప్రజలకు తమ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిద్దాం

ఎస్పీ వి.రత్న

విశాలాంధ్ర – హిందూపురం : స్వీయ నియంత్రణ వ్యక్తిగత క్రమశిక్షణతో ఈ ఏడాది గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రమాద రహితంగా నిర్వహించుకోవాలని ఎస్పీ శ్రీమతి వి.రత్న ఐపీఎస్ సూచించారు. హిందూపురం పట్టణంలోని పరిగి రోడ్డులో గల కంచి కామాక్షి కళ్యాణ మండపంలో మంగళవారం గణేష్ ఉత్సవ కమిటీల నిర్వాహకులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీమతి వి. రత్న ఐపీఎస్ మాట్లాడుతూ గత ఏడాది హిందూపురంలో జరిగిన చిన్న చిన్న సంఘటనలను దృష్టిలో ఉంచుకొని, ఈ ఏడాది పూర్తి ప్రమాద రహితంగా వేడుకలు నిర్వహించి కొత్త ట్రెండ్ సెట్ చేద్దామని వివిధ సంఘాల నాయకులు, గణేష్ ఉత్సవ కమిటీల నిర్వాహకులు, యువతకు సూచించారు. గణేష్ ఉత్సవాల్లో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా రాష్ట్రవ్యాప్తంగా డీజీపీ కార్యాలయం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నారన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయాలు కలగకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విగ్రహాలు ఏర్పాటు ఏర్పాటు చేసిన రోజు నుండి నిమజ్జనం చేసే వరకు మండపాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

జిల్లా వ్యాప్తంగా గణేష్ ఉత్సవ కమిటీల నిర్వాహకులతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో తగిన సలహాలు ఇస్తున్నామన్నారు. ఏడాది గతం కన్నా గణపతి విగ్రహాల పరిమాణాన్ని, డీజే శబ్ద కాలుష్యాన్ని తగ్గించాలని, ఉత్సవ కమిటీల నిర్వాహకులు నిర్ణయిం చడం అభినందనీయమని పేర్కొన్నారు. డీజేల శబ్ద స్థాయి తగ్గించడం వల్ల ఆరోగ్యపరంగా ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రత్యేక యాప్ ద్వారా విగ్రహాలు ఏర్పాటు తదితర వాటికి అనుమతులు పొందాలన్నారు. భక్తి భావంతో జరుపుకునే వినాయక వేడుకలను ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహిస్తేనే విజయవంతం అవుతాయన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ కోరారు.

27, 28న ఆరోగ్య శాఖ మంత్రి పర్యటన

విశాలాంధ్ర–ధర్మవరం: ధర్మవరంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ కుమార్ యాదవ్ ఈనెల 27 వ తేదీ, 28వ తేదీలలో పలు కార్యక్రమాలలో పాల్గొంటారని నియోజకవర్గ మంత్రి ఇన్చార్జ్ హరీష్ బాబు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ 27వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుండి ధర్మవరంలోని గణేష్ మండపాలలో జరిగే పూజా కార్యక్రమంలో పాల్గొంటారని, అనంతరం 28వ తేదీ గురువారం ఎన్డీఏ కార్యాలయంలో ప్రజల కొరకు అందుబాటులో ఉంటారని వారు తెలిపారు. కావున ప్రజలు తమ సమస్యలను విన్నవించుకునే అవకాశం ఉందని , అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మట్టి గణపయ్యలనే పూజిద్దాం

విశాలాంధ్ర–ధర్మవరం: పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ విద్యార్థులు బంక మట్టితో, స్వయంగా మట్టి గణపయ్యలను తయారు చేసి మట్టి గణపయ్యలనే పూజిద్దాం, పర్యావరణాన్ని రక్షించుకుందాం అని నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నిర్మలాదేవి మాట్లాడుతూ మట్టి వినాయకులు మేలు అని, పిఓపి, రసాయనరంగులతో ముప్పు అని,నిమజ్జనం చేస్తే నీరు కలుషితమే కాకుండా మూగజీవాలు మృత్యువాత పడే ప్రమాదం ఉందని తెలిపారు. డైరెక్టర్లు శెట్టిపి సూర్య ప్రకాష్ రెడ్డి, శెట్టిపి పద్మ ఉపాధ్యాయ బృందం హిందూ సాంప్రదాయాలను గౌరవించడం అందరి బాధ్యత అన్నారు. హెడ్మాస్టర్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ హిందూ సాంప్రదాయాలను గౌరవించడం అందరి బాధ్యత అన్నారు. పట్టణంలోని కాగితాల వీధిలోగల ప్రణవసాయి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల యందు పాఠశాల విద్యార్థులు బంకమట్టితో తయారుచేసిన వినాయకుని ప్రతిమలను ఆ పాఠశాల విద్యార్థులకే పంపిణీ చేసినట్లు చెప్పారు. కరెస్పాండెంట్ కిషోర్, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ వేడుకలు.. స్థానిక రిషి విద్యాలయంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని గణేష్ వేడుకలను విద్యార్థుల నడుమ ఘనంగా నిర్వహించామని.. హెడ్మాస్టర్ కరణ్ స్వరూప సింగ్ తెలిపారు. ఎవరు గొప్ప అనే నాటకం విద్యార్థులు ప్రదర్శించడం అందరినీ విశేషంగా ఆకట్టుకుందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. భగవంతుని తర్వాత కంటికి కనిపించే ప్రత్యక్ష దైవాలు తల్లిదండ్రులను సేవించుకోవాలని తెలిపారు. అదేవిధంగా పాఠశాలలో మట్టి గణపతుల తయారీ పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల డీల్ భాస్కర్ రెడ్డి, సీఈఓ రవీంద్ర ఏవో రంగారెడ్డి, ఇంచార్జ్ హెడ్మాస్టర్ కళ్యాణి పాల్గొన్నారు.

సీపీఐ అగ్రనేత సురవరంకు నివాళి

విశాలాంధ్ర–నల్లమాడ : మండల కేంద్రంలోని సీపీఐ కాలనీలో మంగళవారం సీపీఐ మండల కార్యదర్శి వలిపి వెంకటరమణ ఆధ్వర్యంలో అగ్రనేత సీపీఐ సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఐ పార్టీలో రెండుసార్లు ఎంపీగా గెలుపొంది బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం పోరాటం చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఆయన చేసిన సేవలు కొనియాడారు. సీపీఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో నిమజ్జనం నిర్వహించాలి

విశాలాంధ్ర–నంబులపూలకుంట : మండల పరిధిలో వినాయక నిమజ్జనాన్ని మూడు రోజుల్లోనే నిర్వహించాలని కదిరి డీఎస్పీ శివ నారాయణ స్వామి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ముస్లిం మత పెద్దలు, వినాయక మండపాల కమిటీ సభ్యులతో శాంతి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి డీఎస్పీ శివ నారాయణ స్వామి,రూరల్ సిఐ నాగేంద్ర, గాండ్లపెంట ట్రైనీ ఎస్సై రవికుమార్ పలు సూచనలు ఇచ్చారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండపం వద్ద నిర్వాహకులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. నిమజ్జనం కార్యక్రమానికి చిన్న పిల్లలను దూరంగా ఉంచాలని, సాయంత్రం 6 గంటల లోపలే నిమజ్జనం నిర్వహించాలని సూచించారు. ఎలాంటి గొడవలు జరగకుండా నిర్వాహకులు వ్యవహరించాలన్నారు.

వినాయక విగ్రహాలు ఉచితంగా వితరణ

విశాలాంధ్ర–తలుపుల : మండలం పరిధిలో ఉన్న పెద్దన్నవారిపల్లి కీర్తి శేషులు బండారు నారాయణ గారి మనమడు బండారు వెంకట్ శర్వణ్ వినాయక చతుర్థి సందర్భంగా సంగటివారిపల్లి, వేమలగొంది, మైరాడ, వడ్డేపల్లి, దేవాలనాయక్ తండా, హరిజనవాడ, పూలవాండ్లపల్లి గ్రామాలకు రూ.1.20 లక్షల విలువైన విగ్రహాలు, చిన్నన్న వారిపల్లి గ్రామానికి రూ. 6 వేల విలువైన విగ్రహాన్ని ఉచితంగా అందించారు. అందుకు ఆయా గ్రామాల ప్రజలు ఆనందపడుతూ బండారు వెంకట్‌శర్వణ్ వారి కుటుంబ సభ్యులకు వినాయకుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమిస్తే చర్యలు

విశాలాంధ్ర–ముదిగుబ్బ : మండల కేంద్రంలోని ఫిర్యాదుల మేరకు కస్తూరిబాయ్ కాలనీలో పలువురు ఆక్రమించిన మినీ స్టేడియం స్థలాన్ని, కాలనీ ఫ్యూచర్ నీడ్స్ స్థలాలను ఈరోజు ధర్మవరం ఆర్డిఓ మహేష్ పరిశీలించారు, ఆయన మాట్లాడుతూ వీటిపై ఇప్పటికే థర్డ్ పార్టీ విచారణ జరిగిందని నివేదిక రాగానే తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు, ప్రభుత్వ స్థలాలు అక్రమనకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ నారాయణ స్వామికి సూచించారు.

మట్టి గణపతి ప్రతిమల పంపిణీ..

విశాలాంధ్ర–గోరంట్ల : వినాయక చవితి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని పండుగ నిర్వహణకు అతి ముఖ్యమైనది, వినాయకుని విగ్రహాలు అందులో భాగంగా మంగళవారం గోరంట్ల గోల్డ్ లోన్ బ్యాంక్ నందు మేనేజర్ రామాంజనేయులు, బ్యాంకు సిబ్బంది ఆధ్వర్యంలో 100 మట్టి వినాయకులను ఇంటింటికీ పంపిణీ చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పాడాలని ఉద్దేశంతో మట్టి వినాయకులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది సురేష్, అశోక్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ పురుషోత్తం రెడ్డి ఆరోపణలపై చర్చకు సిద్ధమా.. ?

విశాలాంధ్ర–చిలమత్తూరు: స్థానిక వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ పురుషోత్తం రెడ్డి చేసిన ఆరోపణలపై మేము సిద్ధం, బస్టాండ్ ఆవరణలో బహిరంగ చర్చకు రండి మీరు సిద్ధమా అంటూ టిడిపి నాయకులు నాగరాజ్ యాదవ్ సవాల్ విసిరారు. మంగళవారం మండల కేంద్రంలో లక్ష్మీనారాయణ యాదవ్, లక్ష్మీనరసప్ప, గౌరీ శంకర్ తదితరులతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంతో మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా సరే ప్రజాసేవ చేశానే గాని తప్పు పనులు చేయలేదన్నారు, ఎక్కడైనా తప్పు చేశానని నిరూపిస్తే నేను రాజకీయ సన్యాసం తీసుకుంటా, అదే నిరూపణ కాకుంటే మీరు రాజకీయ సన్యాసం తీసుకుంటారా అని ప్రశ్నించారు. మండలంలో వైసీపీలో మీరు తప్పులు చేయలేదా మీకు గుర్తుకు లేదా, అంటూ హెచ్చరించారు ప్రజాస్వామ్యంలో సేవ చేస్తూ ముందుకు వెళ్లాలి.. ఇలా రాజకీయ దురుద్దేశం తో బురద చల్లడం సరికాదన్నారు. పార్టీలు వస్తుంటాయి పోతుంటాయి, ఏ పార్టీ వచ్చినప్పుడు ఆ పార్టీ వారు ప్రజలకు సేవలు అందిస్తూ ముందుకెళ్లాలే గాని కుళ్ళు కుతంత్రాలు చేస్తూ రాజకీయం చేసింది ఎవరో ప్రజలకు తెలుసు అన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయండి

మంత్రి సవితకు నియోజకవర్గం ఈడిగ కులస్తులు వినతి

విశాలాంధ్ర–పెనుకొండ: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్వాతంత్య్ర సమరయోధుడు, గీత కులాల ముద్దు బిడ్డ సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించినందుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహ ఏర్పాటు చేయాలని నియోజకవర్గం ఈడిగ (గౌడ) కులస్తులు మంత్రి సవితకు వినతిపత్రం అందించారు. అనంతరం మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఈడిగ గౌడ నాయకులు మాట్లాడుతూ.సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించేందుకు జీవో తీసుకువచ్చేందుకు కృషిచేసిన మంత్రి సవితకు ప్రత్యేకమైన ధన్యవాదలు తెలిపారు. సర్దార్ గౌతు లచ్చన్న పోరాటయోధుడు, గొప్ప సంఘసంస్కర్త అన్నారు. ఆయన సేవలను గుర్తించి 1952లో సోంపేట నియోజక వర్గం నుండి శాసన సభ్యులుగా గెలుపొంది మద్రాసు రాష్ట్ర శాసన సభలో అడుగుపెట్టారని తెలిపారు. టంగుటూరు ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేసి మంచి గుర్తింపు పొందాడన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యునతికి వెలలేని సేవలు అందించిన గీతకులాల సర్దార్ గౌతు లచ్చన్నని ప్రభుత్వ గుర్తించినందుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పెనుకొండ నియోజక వర్గ కేంద్రంలో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటుచేసేందుకు స్థలాన్ని పరిశీలించాలని విగ్రహం తప్పకుండా ఏర్పాటు చేస్తామని మంత్రి సవిత హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చిన్నప్పయ్య, గోరంట్ల ఈడిగ సంఘం నాయకులు గిరిధర్ గౌడ్, సోమందేపల్లి ఈడిగ సంఘం నాయకులు నరేంద్రబాబు గౌడ్, భార్గవ్ గౌడ్, హరీష్ గౌడ్, పవన్ గౌడ్, ప్రకాష్ గౌడ్, బాబు గౌడ్, నరేష్ గౌడ్ పాల్గొన్నారు.

వైభవంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర–హిందూపురం : లేపాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వడ్డి సుధాకర్ అధ్యక్షతన హిందూపురంలోని శ్రీ శేఖర్ అకాడమీలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవ ముందస్తు వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జానపద కళల అకాడమీ తొలి అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ, హిందూపురం మునిసిపల్ ఛైర్మన్ డి.ఈ రమేష్ కుమార్ పాల్గొని తెలుగు భాష పట్ల అంకితభావంతో పనిచేస్తున్న లేపాక్షి ఫౌండేషన్ సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ తెలుగు భాష అభ్యున్నతి కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. లేపాక్షి ఫౌండేషన్ చైర్మన్ వడ్డి సుధాకర్ మాట్లాడుతూ, తెలుగు భాష అభ్యున్నతికి అభివృద్ధికి లేపాక్షి ఫౌండేషన్ ముందుంటుందని భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను చేపడతామని తెలియజేస్తూ కవులకు తెలుగు భాషా పురస్కారాలను, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అతిథుల చేతుల మీదుగా ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గంగప్ప, కౌన్సిలర్ దుర్గా నవీన్, హెల్పింగ్ హాండ్స్ ఫౌండర్స్ శ్రీధర్ గౌడ్, మాజీ సైనికులు చలపతి, లేపాక్షి ఫౌండేషన్ సభ్యులు ధనాశి ఉషారాణి, చంద్రశేఖర్, అశోక్ కుమార్, శశికళ,విజయ్ కుమార్, పలు జిల్లాల కవులు, విజేతలు పెద్ద ఎత్తున తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఘనంగా సన్మానం చేశారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

విశాలాంధ్ర–పుట్టపర్తి: తెలుగుదేశం పార్టీ హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు ఆర్జే రత్నాకర్ జర్నలిస్టులకు మట్టి వినాయక విగ్రహాలతో పాటు మొక్కలను పంపిణీ చేశారు. అదేవిధంగా సత్యమ్మ గుడి వద్ద ఆర్డీవో సువర్ణ మట్టి వినాయక విగ్రహాలు, పండ్ల మొక్కలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సువర్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పండుగను ప్రకృతి సిద్ధంగా నిర్వహించుకోవాలన్నారు. ప్రజలు మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వాడడం వల్ల జల వాయు కాలుష్యాలు జరుగుతాయని కాబట్టి ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాలను వినియోగించి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆర్డిఓ తెలిపారు.

సమకాలీన ప్రజాస్వామ్యంపై అవగాహన అవసరం..

విశాలాంధ్ర–ధర్మవరం : పట్టణంలోని స్థానిక కే.హెచ్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం విభాగాధిపతి డా.బి.గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో, కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన సమకాలిన ప్రజాస్వామ్యం అనే అంశంపై కార్యక్రమం జరిగింది. ప్రొఫెసర్ డా.బి.వి. రాఘవులు, రిటైర్డ్ ప్రొఫెసర్, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం వారు "ప్రజాస్వామ్య సిద్ధాంతాలు సూత్రాలపై అతిథి ఉపన్యాసం చేశారు. ప్రజాస్వామ్యం మూలాలు, పరిణామం, ఆధునిక దేశాలు, ప్రభుత్వాలు ప్రజాస్వామ్యంలో అనుసరిస్తున్న పద్ధతులు, విలువలు, విధానాలు, ప్రజాస్వామ్యంలో యువత బాధ్యత సమకాలీన ప్రజల భాగస్వామ్యం, వ్యక్తిత్వ వికాసం, ఉన్నత విద్యా అవకాశాలను విద్యార్థులకు తెలియజేశారు. ప్రిన్సిపాల్ డా.కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతు ప్రొఫెసర్ బి.వి.రాఘవులు, శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీకి చేసిన సేవలు ఎనలేనివని, ఎంతో మందికి పిహెచ్‌డి, పిడిఎఫ్ ఫెలోషిప్‌లు అందించినవారిలో ముఖ్యులని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, డా ఎస్. చిట్టెమ్మ, డాక్టర్ బి. గోపాల్ నాయక్, డాక్టర్ ఎస్. షమివుల్లా, ఎస్.పావని, బి . ఆనంద్, జి.మీనా, జి. ధనుంజయ, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు చట్టపరిధిలోనే జీవించాలి

విశాలాంధ్ర–ధర్మవరం: మండల పరిధిలోని గ్రామాలలో నివసించే ప్రజలు చట్టపరిధిలోనే జీవించాలని రూరల్ ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని రేగాటిపల్లి సుబ్బారావు పేట, తుమ్మల గ్రామాలలో గ్రామసభను ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వినాయక చవితి పండుగను ఐక్యమత్యంతో ప్రశాంతంగా జరుపుకోవాలని తెలిపారు. విగ్రహ మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీసులకు వెంటనే సమాచారాన్ని ఇవ్వాలని తెలిపారు. సచివాలయ మహిళా పోలీసులు ప్రతి గ్రామంలో వినాయక చవితి పండుగ సజావుగా జరిగేటట్లు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సమాచారాన్ని రూరల్ పోలీస్‌స్టేషనుకు అందించాలని తెలిపారు. నిమజ్జనం చేసేటప్పుడు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

మూడు జట్ల విజయం

విశాలాంధ్ర–ధర్మవరం: పట్టణంలోని ఆర్డిటి మైదానంలో జరుగుతున్న అటల్ బిహారి వాజ్‌పాయ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ సీజన్–2 మంగళవారం ఏడవ రోజు పోటీలు ఉత్కంఠభరితంగా, రసవత్తరంగా కొనసాగాయి. తొలి మ్యాచ్‌లో గొట్లూరు జీ.కే.పీ – లెవెన్స్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన గొట్లూరు జట్టు ధాటిగా ఆడి మంచి స్కోరు సాధించింది. అనంతరం బౌలర్లు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రత్యర్థి జట్టు రన్స్‌ను నియంత్రించడంతో, 28 పరుగుల తేడాతో గొట్లూరు జట్టు ఘన విజయం సాధించింది. మ్యాచ్ మొత్తంలో సమన్వయంతో ఆడిన గొట్లూరు ఆటగాళ్లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. రెండవ మ్యాచ్‌లో రాంనగర్ స్టార్స్ ,బడన్నపల్లి వారియర్స్ జట్లు పరస్పరం తలపడ్డాయి. చివరి ఓవర్ల వరకు ఉత్కంఠ కొనసాగింది. అయితే, కీలక సమయాల్లో రాంనగర్ స్టార్స్ జట్టు ఆటగాళ్లు ప్రతిభ చూపడంతో 16 పరుగుల తేడాతో విజయం తమ సొంతం చేసుకున్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో రాంనగర్ ఆటగాళ్ల సమన్వయం వారికి విజయాన్ని అందించింది. మూడవ మ్యాచ్‌లో రామాపురం – లెవెన్స్, ఎస్.వి బాబు యూత్ జట్లు తలపడ్డాయి. ఈ పోరులో రామాపురం జట్టు అద్భుతమైన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ప్రత్యర్థి జట్టుపై ఆధిపత్యం సాధించింది. బ్యాట్స్‌మెన్ భారీ స్కోరు కట్టిపడేసి, బౌలర్లు ఖచ్చితమైన లైన్, లెంగ్త్‌తో ప్రత్యర్థులను కట్టడి చేశారు. ఫలితంగా, 98 పరుగుల భారీ తేడాతో రామాపురం – లెవెన్స్ జట్టు విజయం సాధించింది. రోజంతా జరిగిన ఈ మూడు పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను బీజేపీ నాయకులు ఆటగాళ్లకు జ్ఞాపికల రూపంలో అందజేశారు. జట్లు ఫైనల్స్ వైపు దూసుకెళ్తున్న క్రమంలో ప్రతి మ్యాచ్ క్రీడాభిమానులకు మరపురాని అనుభూతి అందించింది. కార్యక్రమంలో మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్‌బాబు, కోచ్ పృథ్వీ, కోచ్ రాజశేఖర్, బిజెపి నాయకులు పోతుకుంట రాజు, మైనార్టీ నాయకులు నబి రసూల్, దర్శనమల ధనుంజయ, చింతా బాలకృష్ణ, పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలో ప్రతిభ

విశాలాంధ్ర–ధర్మవరం : ఇటీవల హిందూపురంలో తెలుగు భాషా దినోత్సవ వ్యాసరచన పోటీలకు ధర్మవరం పట్టణంలోని సీతారామయ్య జూనియర్ కళాశాల బాలికల విద్యార్థులు తమ ప్రతిభను ఘనపరచడం జరిగింది. ఈ వ్యాసరచన పోటీలో ధర్మవరం మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులను ఆర్. భావన, సి.లహరి, సి. తేజిత విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా హిందూపురం మున్సిపల్ చైర్మన్ రమేష్ ఎంఈఓ గంగప్ప జానపద కలల అకాడమీ అధ్యక్షులు హరినాథ్ చేతులమీదుగా విద్యార్థులకు బహుమానాలను అందజేశారు. తదుపరి కరస్పాండెంట్ సీతారామయ్యతో పాటు అధ్యాపకులు అభినందన శుభాకాంక్షలు తెలిపారు.

మల్బరీ పెంపకంతో అధిక లాభాలు

విశాలాంధ్ర – అగళి : మల్బరీ తోటల పెంపకంతోనే రైతులకు అధిక లాభాలు వస్తాయని సిరికల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ రమ్య సత్యసాయి జిల్లా సిరికల్చర్ జెడి శోభ రాణి ఆర్ ఎస్ ఆర్ ఎస్ డైరెక్టర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. దాసే గౌడనహళ్లి గ్రామంలో మంగళవారం పట్టు రైతులకు మడకశిర ఏడి హనుమంతరాయప్ప ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మల్బరీ సాగుకు ప్రోత్సాహకాలు కూడా అధికంగా అందిస్తుందన్నారు. మండలంలో 300 మంది రైతుల వరకు 480 యాక్టర్లు మల్బరీ తోటలు సాగు చేశారన్నారని, మొక్క పెంచినప్పటి నుంచి కోతకు వచ్చేంతవరకు.. మల్బరీ షెడ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వ సహాయం కూడా అందజేస్తుందన్నారు. ఆకు నాణ్యత రోగాల నివారణ పట్టు పురుగుల రోగ నివారణ పట్టుపురుగుకు వచ్చే రోగాల గురించి వివరించారు. సదస్సులో మడకశిర సిరికల్చర్ ఏడి హనుమంతరాయప్ప ఎస్ఓ పుట్టపర్తి నవీన్ సిబ్బంది నాగరాజు, జయరాం, మల్లప్ప, ముద్ద గిరి అప్ప, గురుమూర్తి, మల్లికార్జున పాల్గొన్నారు

ప్రభుత్వ ప్రోత్సాహకాలు మెండు

విశాలాంధ్ర–నంబులపూలకుంట: మల్బరీ పంట సాగు చేస్తే ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీలు ఎక్కువగా ఉంటాయని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్ రెడ్డి,సెరికల్చర్ టెక్నికల్ ఆఫీసర్ బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎన్ పి కుంటకు చెందిన షబానా అనే మహిళా రైతు సాగు చేస్తున్న మల్బరీ పంటను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు.

నిబంధనల ప్రకారం పండుగ నిర్వహించాలి

విశాలాంధ్ర–బుక్కపట్నం: ప్రశాంతమైన వాతావరణంలో వినాయక చవితి పండుగను జరుపుకోవాలని ఇన్చార్జ్ తహసిల్దార్ నరసింహులు, ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో వినాయక మండప నిర్వాహకులచే సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక మండపాల కోసం పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని నిబంధనల మేరకే మండపాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

మండపాలకు అనుమతులు తప్పనిసరి

విశాలాంధ్ర–కొత్తచెరువు: వినాయక చవితి పండుగ సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సిఐ మారుతి శంకర్, తెలిపారు. ఈ మండపాలు ఏర్పాటు చేసేవారు ఆంధ్రప్రదేశ్ పోలీస్ వెబ్సైట్ లో పూర్తి వివరాలను పొందుపరిస్తే అలా నమోదు చేసుకున్న వారికి ఆన్లైన్లో పర్మిషన్ మంజూరు చేస్తామన్నారు. క్యూఆర్ కోడ్ ప్రింట్ ను ఆయా గణేష్ మండపాల దగ్గర కనబడేటట్టు ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో మూడు రోజులు మండల కేంద్రంలో ఐదు రోజులకు నిమజ్జనాన్ని పూర్తి చేసుకోవాలన్నారు. .గొడవలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామీణ బ్యాంక్ మేనేజర్లకు ఘన సన్మానం

విశాలాంధ్ర–రొళ్ల: స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్న నాగరమణ బదిలీపై చిత్తూరు జిల్లా మదనపల్లెకు వెళ్లారు. రొళ్ల ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌గా తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్‌కు చెందిన చేతన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.ఇదే బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్గా పనిచేస్తున్న రవికుమార్ అనంతపురం మారుతి నగర్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బ్యాంక్ సిబ్బంది సాధారంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరువురికి పూలమాల వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా బ్యాంక్ సిబ్బంది మాట్లాడుతూ వారి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సంజీవరాయుడు క్యాషియర్ శ్రీనివాసులు హరిత,బాలకృష్ణ ఆనంద్ గోపమ్మ,బ్యాంక్ మిత్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు..

వృథాగా వెళ్తున్న తాగునీటిని అరికట్టండి

విశాలాంధ్ర–గుడిబండ: మండలంలోని తిమ్మలాపురం ఎస్సీ కాలనీలోని ఆర్ డీటీ సంస్థ వారు ప్రజల అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన తాగునీటి బోరు లోని నీరు వృథాగా పారుతోందని.. అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరారు. ఎస్సీ కాలనీలోని హనుమంతరాయప్ప, తిప్పేస్వామి (హనుమంత అలియాస్ ఎస్సై)లు మాట్లాడుతూ మా కాలనీలో తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న ఆర్‌డిటి సంస్థ వారు బోరు వేయించగా పుష్కలంగా నీళ్లు రావడంతో పంప్ సెట్ మోటార్లను ఏర్పాటుచేసి వదిలేశారన్నారు. కాగా నిత్యం నీరు వృథాగా వెళ్లి రోడ్డుపై ప్రవహిస్తుండటంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. రోడ్లు చిత్తడిగా మారి జారి పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఎరువుల దుకాణాలపై దాడులు

విశాలాంధ్ర–ధర్మవరం : పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని ఎరువుల దుకాణాలపై జిల్లా విజిలెన్స్ అధికారులు శ్రీనివాసులు, ఎస్సై గోపాలుడు, డిసిటిఓ సురేష్ కుమార్, ధర్మవరం మండల వ్యవసాయ అధికారి ముస్తాప కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. మండలం కేంద్రంలోని బాలాజీ ఫర్టిలైజర్స్, సాయిరాం సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ షాప్ నందు తనిఖీలు నిర్వహించారు. అనంతరం అధికారులు ఈపాస్ నిల్వ, స్టాకు రిజిస్టర్, భౌతిక నిల్వలను పరిశీలించడం జరిగింది. నిల్వలలో వ్యత్యాసం వల్ల రూ.1,06,300 విలువగల 3.95 టన్నుల ఎరువుల విక్రయాలు నిలుపుదల చేశారని తెలిపారు. గొట్లూరు,పోతుకుంట గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో ఎరువుల నిలువలు తనిఖీ చేశామని, రైతులకు సేవ చేయుటలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబులు రాజశేఖర్, ఆదినారాయణ పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, బుధవారం 27, ఆగస్టు 2025

మంటపాల వద్ద జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర-రొళ్ల: మండల వ్యాప్తంగా వినాయక చవితి పండగ ప్రజలు భక్తిశ్రద్ధలతో సంతోషంగా జరుపుకోవాలని తహసీల్దార్ షేక్షావలి తెలిపారు. మండల ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేస్తూ ముఖ్యంగా వినాయక మండపాల వద్ద జిల్లా కలెక్టర్,ఎస్పీ సూచనల మేరకు నియమా నిబంధనలు పాటించాలని పోలీస్ శాఖ వారి అనుమతి తప్పనిసరి తీసుకోవాలని ఎలక్ట్రిక్,సర్క్యూట్ కాకుండా డిజె సౌండ్ సిస్టం వంటివి లేకుండా,గ్రామాల్లో ఎలాంటి అల్లర్లకు తావులేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై వీరాంజనేయులు, విద్యుత్ శాఖ ఏఈ నిజాముద్దీన్ రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల పెన్షన్ తొలగించడం దారుణం..

విశాలాంధ్ర-శింగనమల : అర్హులైన వికలాంగుల పెన్షన్లను నిర్దాక్షిణంగా తొలగించడం చాలా బాధాకరం తొలగించిన పెన్షన్లను యధావిధిగా కొనసాగించాలని వైసీపీ మండల కన్వీనర్ పూర్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తూ ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర సంక్షేమాన్ని పరిపాలనను పక్కకునెట్టేసి కేవలం కక్ష సాధింపు ధోరణిలో నిమగ్నమై ఉందన్నారు. వికలాంగుల పింఛన్లు తొలగించడం దారుణమని తక్షణమే వాటిని పునర్ధించాలని డిమాండ్ చేశారు. సదరం సర్టిఫికెట్లను రీ వెరిఫికేషన్ పేరుతో డాక్టర్లు తమ జేబులు నింపుకొని అర్హులైన వికలాంగులను నట్టేట ముంచారని, వికలత్వం ఉన్నా లంచం ఇవ్వని వారిని వికలత్వ శాతాన్ని పూర్తిగా తగ్గించి వికలాంగులను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పోయిన వికలాంగుల పెన్షన్లను పునరుద్ధరించి పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో భాస్కర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సమన్వయకర్త. వీరాంజనేయులు, గొల్లారెడ్డి, నూర్ మహమ్మద్, నాగలగుడ్డం వెంకటరమణ, మల్లికార్జున్ రెడ్డి. వేస్ట్ నరసాపురం సర్పంచ్ వెంకట రాముడు, వైసీపీ మహిళా నాయకురాలు శివమ్మ, శివారెడ్డి.జగన్ రెడ్డి. శీన, అలీ. వెంకటనారాయణ, ఎం.వీరాంజనేయులు, పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోండి..

విశాలాంధ్ర-ముదిగుబ్బ: మండలంలో వినాయక చవితి ఉత్సవాలు నిమజ్జనం పై మంగళవారం రూరల్ సిఐ శ్యామ్ రావు సూచనల మేరకు పట్నం ఎస్సై జయ రామ్ నాయక్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక మండపాలు దగ్గర ఎవరు గొడవలు సృష్టించకుండా, రహదారులకు ఎలాంటి ఆటంకం లేకుండా ఏర్పాటు చేసుకోవాలి, ఎలాంటి అల్లర్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిమజ్జనం సమయంలో డిజేలు ఎక్కువ సౌండ్ వచ్చే పరికరాలు వాడరాదని, మత్తు పానీయాలు సేవించరాదని సూచించారు నిమజ్జం చేసే సమయంలో చిన్న పిల్లలను తీసుకొని వెళ్లకూడదన్నారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ

విశాలాంధ్ర-తలుపుల: స్థానిక మూడు రోడ్ల కూడలి నందు లిరూలర్ డెవలప్మెంట్ ఫ్రెండ్స్ ట్రస్టీ ఆధ్వర్యంలో ఘనంగా మదర్ తెరిసా జన్మదిన వేడుకలు జరిగాయి. ట్రస్టు సభ్యుడు మన్సూర్ మాట్లాడుతూ పేద ప్రజలకు, రోగులకు ఒక తల్లిలా సేవ చేసిందని అందువల్లే ప్రపంచంలోనే ప్రఖ్యాతిగాచిన నోబెల్ బహుమతి పొందారని తెలియజేశారు. పేద ప్రజలకు 30 మందికి ఈరోజు దుప్పట్లు పంచారు. అలాగే కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తలుపుల ఎస్సై నరసింహుడు మాట్లాడుతూ మదర్ తెరిసా మానవత్వాన్ని చూపించిన తల్లి అని తెలియజేస్తూ ఈ ట్రస్ట్ కి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ శ్రీను, ఎద్దుల రాముడు, జగలి ఈశ్వరయ్య పాల్గొన్నారు.

వేడెక్కిన రాజకీయం

విశాలాంధ్ర-చిలమత్తూరు : మండలంలో మూడు రోజుల క్రితం టిడిపి వైసిపి నాయకుల మధ్య హుస్సేన్ పురంలో జరిగిన దాడికి టిడిపి నాయకుడు బాబు రెడ్డి, వైసీపీ ఎంపీపీ పురుషోత్తం రెడ్డి మధ్య జరిగిన ఘర్షణలో భాగంగా మంగళవారం ఎంపీపీ ప్రెస్ మీట్‌కు ఏర్పాట్లు చేశారు. సమాచారం తెలుసుకున్న టిడిపి నాయకులు ప్రెస్‌మీట్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించారు.ఈ నేపథ్యంలో ఎంపీపీ మాట్లాడుతూ చిలమత్తూరు సెజ్ భూముల్లో టిడిపి నాయకుడు నాగరాజు అక్రమాలకు పాల్పడ్డాడంటూ తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించారు. మరోవైపు వైసిపి కార్యాలయం సమీపంలో రోడ్డుపై ఆందోళనకు దిగారు. టిడిపి నాయకులు. మా పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టకూడదా అంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు వైసిపి ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, ఇరు పార్టీల నాయకులు పోటాపోటీ నినాదాలు చేసుకున్నారు.వైసీపీ కార్యాలయంలో జై జగన్ అంటూ నినాదాలు చేయగా, టిడిపి నాయకులు జై బాలయ్య అంటూ నినాదాలు చేశారు. దీంతో సీఐ జనార్ధన్, పోలీసులు కలగజేసుకొని నాయకులను సముదాయించి పంపించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

భేటీ బచావో, బేటి పడావోపై అవగాహన

విశాలాంధ్ర-పెనుకొండ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థినులకు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని ప్రమీల సూచనల మేరకు సబర్డినేట్ వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది అడ్మినిస్ట్రేటర్ కేస్ వర్కం వన్ స్టాప్ సెంటర్ సేవలు గురించి, బేటి బచావో బేటి పడావో గురించి, హెల్ప్ లైన్స్, గురించి, ఫోక్సో, గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు వి.విజయలక్ష్మి, బి.జీ శ్రీకళ, స్రవంతి, వి.జయ్ ప్రకాష్ ఎన్ఎస్ఎస్‌పిఓలు డి.శివన్న, కే.రవికుమార్, ఎం.శ్రీలేఖ పాల్గొన్నారు,

మహిళా పోలీసులకు అవగాహన

విశాలాంధ్ర-పెనుకొండ : వినాయక చవితి సందర్భంగా పెనుకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న మహిళా పోలీస్‌లతో సీఐ రాఘవన్, మంగళవారం, పోలీస్ స్టేషన్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు, వినాయక మండపాల వద్ద, ఊరేగింపు సమయంలో నిమజ్జనం ప్రదేశాలలో వద్ద తీసుకోవాల్సిన తగిన జాగ్రత్త లు గురించి తెలియ చేయడం అయినది ఈ సమావేశానికి ఎస్సై వెంకటేశ్వర్లు, ట్రైనీ ఎస్సై భువనేశ్వరి మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

విశాలాంధ్ర-రొళ్ల: రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకట బ్రహ్మం తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎరువుల షాపులలోని లైసెన్సులను స్టాకు రిజిస్టర్లను,బిల్లుబుక్ లను వారు పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండి కంపెనీలకు సంబంధించిన ఫారం ఓ లను ఎప్పటికప్పుడు లైసెన్స్ లో నమోదు చేయించుకోవాలని తెలిపారు.ఎరువుల సేల్స్ ను ఎప్పటికప్పుడు ఈ పోస్ మిషన్ల ద్వారా అప్డేట్ చేయాలని తెలిపారు అనుమతి లేని ఎరువులను డీలర్లు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా ఎరువుల షాపుల నందు స్టాకు వ్యత్యాసం విలువ చేసే ఎరువుల విక్రయాలను సంబందించి స్టాక్ వ్యత్యాసం ఉండకూడదన్నారు ఇకనుంచి మండల టీములు షాపులను నిరంతరం తనిఖీలు చేస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు..

మట్టి వినాయక విగ్రహాల తయారీ

విశాలాంధ్ర-గుడిబండ: మండలంలోని కరికెర గ్రామ సమీపంలోని కెజిబివి పాఠశాలలో విద్యార్థినిలు స్వాతంగా మట్టితో వినాయకుడి ప్రతిమను ఏర్పాటు చేసినట్లు ఎస్ఓ పరమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి పూజకు అధిపతి అయిన వినాయకుని ప్రతిమ ఏర్పాటు కోసం తమ పాఠశాలలోని విద్యార్థినీయు లు మట్టి గణపతిని తయారు చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

జాతీయ రహదారి విస్తరణ పరిశీలించిన కలెక్టర్ చేతన్..

విశాలాంధ్ర-గోరంట్ల: మండలంలోని గుమ్మయ గారి పల్లి క్రాస్ వద్ద నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారిని కలెక్టర్ టీఎస్ చేతన్ పరిశీలించారు, సంబంధిత జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు, పురోగతిలో ఉన్న పనులను పరిశీలించారు. అనంతరం పుట్టపర్తి మండలం గువ్వలగుంటపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారిని పరిశీలించారు. కార్యక్రమంలో జాతీయ రహదారి డీఈ గిడ్డయ్య, జేఈ కావ్య, కాంట్రాక్టర్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ధర్మవరం పట్టణ శాఖ కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం పట్టణ ఏపీటీఎఫ్ శాఖ కార్యవర్గాన్ని స్థానిక మున్సిపల్ హైస్కూల్లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికల అధికారి సానే రవీంద్రరెడ్డి, పరిశీలకులు పి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్ కుమార్, బి కే ముత్యాలప్ప, బలరాముడు ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షులుగా జెన్ని నాగప్ప, అధ్యక్షులుగా . ఎన్ గోపి, ప్రధాన కార్యదర్శిగా ఏం.అంజినాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా నాగభూషణ నాగశేఖర్, శిరీష, చెన్నుడు రామాంజనే యులు కార్యదర్శులుగా బషీర్ అహ్మద్, కే.విజయ్ కుమార్, ఎం. దుర్గా, బి.కాంతమ్మ జిల్లా కౌన్సిలర్స్‌గా ఉమాపతి, అమానుల్లా ఓబులేష్, కృష్ణవేణి జగదీష్ ,వెంకటరమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా శేఖర్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రవీందర్‌రెడ్డి తెలియజేశారు. ఎన్నికైన కమిటీ వారు మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించుటకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.

మట్టి గణపతి ప్రతిమను పూజిద్దాం..

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని విజన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో "మట్టి గణపతిని పూజిద్దాం -పర్యావరణాన్ని కాపాడుదాం" అని నినాదంతో మంగళవారం విజన్ హై స్కూల్‌లో నిర్వహించిన మట్టి వినాయకుల తయారీ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని మట్టి గణపతిని తయారు చేశారు. పర్యావరణానికి ఇబ్బంది కలగకుండా పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యతతో మెలగాలని విద్యార్థులు ఈ పోటీలలో మట్టి గణపతి తయారు చేసి అందరి దృష్టి ని ఆకర్షించారు.. కేవలం మట్టి పసుపు, గోధుమ పిండిని ఉపయోగించి ఎటువంటి రసాయనాలు ఉపయోగించ కుండా గణపతిని తయారు చేశారు.

అంగన్వాడీ కేంద్రాల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం

సూపర్ వైజార్ మంజుల

విశాలాంధ్ర-గోరంట్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా ప్రవేశపెట్టిన (సాక్ష్యం) న్యూట్రిషన్ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు గర్భవతులకు బాలింతలకు ఆర్గానిక్ కూరగాయలు ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసిడీఎస్ సూపర్ వైజార్ మంజుల తెలిపారు, గోరంట్ల పంచాయతీ పరిధిలోని గుమ్మయ్య గారిపల్లి బిసి కాలనీ అంగన్వాడీ కేంద్రన్ని (సాక్ష్యం) న్యూట్రిషన్ అంగన్వాడీ కేంద్రంగా ఐసిడిఎస్ జిల్లా ఉన్నత అధికారులు మార్చడం జరిగిందని సూపర్ మంజుల విజయమ్మ తెలిపారు,

అందులో భాగంగా అంగన్వాడీ వాడి చుట్టూ పరిశు భ్రత కోసం పిచ్చి మొక్కలు తొలగించి హద్దులు ఏర్పాటు కోసం సర్వేర్ తాతయ్య ద్వారా అంగన్వాడీ వాడి చుట్టురా మంగళవారం కొలతలు వేసి హద్దులు ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా సూపర్ వైజార్ మంజుల అంగన్వాడీ టీచర్ విజయమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రం చుట్టూ ప్రహరీ కోసం కంచె (మేష్) ఏర్పాటు చేసుకొని అందులో ఇతరులు ఎవరు ప్రవేశించకుండా తాగు జాగ్రత్తలు తీసుకొని అంగన్వాడీ కాళీ స్థలంలో ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు పంటలు ఏర్పాటు చేసుకుని వాటిని సంరక్షణ చేసి వాటి ద్వారా పండించే కూరగాయలతో అంగన్వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు గర్భవతులకు బాలింతాలకు వంట వండి పెట్టాలని వాటి ద్వారా చిన్నారులకు గర్భవతులకు బాలింతాలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సూపర్ మంజుల తెలిపారు, న్యూట్రిషన్ అంగన్వాడీ కేంద్రానికి గ్రామస్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వికలాంగులను వేధిస్తున్న కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర-గుంతకల్లు : వికలాంగుల పింఛన్లు తొలగిస్తే ఉద్యమాలు చేస్తామని సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బి శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ రీ వెరిఫికేషన్ పేరుతో లక్షలాది మంది వికలాంగులకు మనోవేద కలిగిస్తూ వారి ఆత్మహత్యలకు కారణమైన ఆత్మహత్యను ప్రభుత్వ హత్యలుగా ఆరోపించారు. కళ్ళు కనిపించని, కాళ్లు లేని వారిని, స్థిమితం లేని వారిని అనూహర్హులుగా పరిగణించి వారికి నోటీసులు ఇప్పించి వారిలో భయాందోళన సృష్టించి వారి చావుకారమైన ఈ ప్రభుత్వ నిర్ణయాలు ఎప్పటికీ సరికావున్నారు. ప్రభుత్వం నిర్ణయం వల్ల కుటుంబ పోషణతో ఉన్న వికలాంగులు కొంతమంది అయితే, వారి పెన్షన్ తోనే వారికి వైద్య పరీక్షలు నిర్వహించే మరి కొన్ని కుటుంబాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల కుటుంబ పోషణ భారంగా మారడంతో ఆ వృద్ధ వికలాంగులను, రోడ్డుపై నో, దేవాలయాల ముంగిట వదిలేసిన దుస్థితి దాపరించిందని ఆయన తీవ్ర మానసిక వేదన వ్యక్తం చేశారు. డాక్టర్ల ధన దాహంతో చేసిన దొంగ సర్టిఫికెట్ల ఆధారం చేసుకొని పింఛన్లు తొలగించడానికి సిద్ధమైన ప్రభుత్వం తప్పుడు సర్టిఫికెట్లతో దోపిడీకే పాల్పడుతున్న డాక్టర్లపై ఎందుకు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. రీ వెరిఫికేషన్ పేరుతో మానసిక స్థితి, శారీరక స్థితి లేని వికలాంగులను వేధించకుండా ఆయా సచివాలయాలలో మెడికల్ క్యాంపు నిర్వహించి నిర్ధారణ చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిర్ధారణ పూర్తి అయ్యేంతవరకు ఏ ఒక్కరికి పెన్షన్ ఆపకుండా పంపిణీ చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారుతి ప్రసాద్, కసాపురం రమేష్, రాముడు నాయక్, తిమ్మప్ప, భాష, వికలాంగులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులైన వికలాంగులకు పింఛన్ పునరుద్ధరించండి

తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఓకి సిపిఎం నాయకుల వినతి

విశాలాంధ్ర-ముదిగుబ్బ: మండల పరిధిలో అర్హులైన వికలాంగుల పింఛన్ పునరుద్దించాలని మంగళవారం సిపిఎం నాయకులు ఆటో పెద్దన్న ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం లో వీ ఆర్ ఓ రేవతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న అర్హులైన వికలాంగుల పింఛనుదారులకు తక్షణమే పింఛన్ మంజూరు చేసి తగు న్యాయం చేయాలని తెలియజేశారు అదేవిధంగా సదరం సర్టిఫికెట్లను రీ వెరిఫికేషన్ చేసి అర్హులైన వారిని గుర్తించి పింఛన్ మంజూరు చేయాలని ఈ సందర్భంగా తెలిపారు.

అర్హులైన వారికి పింఛన్ రాకపోవడంతో అనారోగ్యంతో ఉన్న వికలాంగులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుంది అని వారి రోజువారి అవసరాలకు కూడా చేతిలో డబ్బులు లేకపోవడంతో జీవనం గడపలేక దిక్కుతోచని స్థితిలో వికలాంగులు పరిస్థితి మారిందన్నారు ఇది ఇలాగే కొనసాగితే అర్హులైన వికలాంగుల పింఛనుదారులు భిక్షాటన చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కనుక వారి సమస్యలను త్వరగా పరిష్కరించి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బండల వెంకటేష్, సీపీఎం నాయకులు గుంజేపల్లి పోతలయ్య, ఆవాజ్ కమిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

గాడితప్పిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు స్టీరింగ్ కమిటీ

విశాలాంధ్ర-గుంతకల్లు : డివిజన స్థాయిలో ఆర్డిఓ ఆధ్వర్యంలో నిర్వహించే ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ పూర్తిగా గాడి తప్పిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఎస్సీ ఎస్టీలు ఎదుర్కొన్నటువంటి సమస్యలు, జీవనోపాధాలకి అవరోధాలు, ఆ సాంఘిక కార్యకలాపాలపై వారి జీవన సాగనం పలు అంశాలపై చర్చించాల్సినటువంటి కమిటీ సమావేశం గాడి తప్పింది. వివరాలు లోకి వెళితే ఆర్డీవో స్థాయి సమావేశంలో జరిగే ఎటువంటి ఈ సమావేశం ప్రతి మూడు నెలలకు ఒకసారి కమిటీ సభ్యులు ఆయా పరిధిలో తిరిగి వారి సమస్యలు తెలుసుకొని అధికారుల దృష్టికి తీసుకువస్తుంటారు. కానీ ఆ సమావేశంలో డివిజన స్థాయి ప్రతి అధికారి ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉండగా స్థానిక గుంతకల్లు పట్టణంలోని అధికారులు సగం మంది కూడా హాజరు కావడం లేదు. ఈ కార్యక్రమం మొక్కుబడిగా నిర్వహిస్తున్నారే తప్ప సంబంధిత అధికారులు ఈ సమావేశానికి హాజరు కావడం లేదు. గత సమావేశాలకు హాజరుకాని అధికారుల పైన ఆర్డీవో ఏమైనా చర్యలు తీసుకున్నారా లేదే? బాధ్యతలు, ఆచరణలు లేని సమావేశాలు ఎందుకు? అంటూ పలు ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. మొక్కుబడిగా వస్తున్నటువంటి అధికారులను కమిటీ సభ్యులు పొగడ్తలతో పోటెత్తుతున్నారు తప్ప ఎస్సీ ఎస్టీ ప్రజా సమస్యలపైచర్చ జరగలేదు. ఎస్సీ ఎస్టీ అనగానే రేప్ అండ్ మర్డర్, దౌర్జన్యం, అట్రాసిటీ అనేది మాత్రమే గుర్తొస్తాయి తప్ప వారి జీవన దైనది నా కార్యక్రమాలు, వారి ఉపాధి పట్ల ఏ ఒక్కరికి ఆలోచన రాకపోవడం కమిటీకి, అధికారులకు ఉన్న దౌర్భాగ్యం. కొందరు ప్రజా సంఘ నేతలు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరి తదితర నాయకులు ఎస్టి, ఎస్సి వాడలలోను,హాస్టల్, విద్యాలయాలు, గ్రామాలలో నిత్యం పర్యటించి ఆ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని లక్ష్యంతో సమావేశానికి వచ్చినప్పుడు సంబంధిత అధికారులు లేకపోవడం జస్టిస్ పున్నయ్య కమిటీకి అవమానం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బాధ్యత వహించి కమిటీకి హాజరు కావడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలంటూ ఎస్సీ, ఎస్టీ కమిటీ సంఘాలు కోరుకుంటున్నాయి.

అర్హులైన దివ్యాంగులకు పింఛన్ ఇప్పించండి..

విశాలాంధ్ర-ధర్మవరం: మండలంలోని అర్హులైన దివ్యాంగులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగాలని కోరుతూ సిపిఎం నాయకులు పెద్దన్న, మారుతి, జేవి రమణ, వెంకటస్వామి, పోతులయ్య తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు ఎంపీడీవో సాయి మనోహర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులను పరిశీలించకుండా నూరు శాతం దివ్యాంగులకు కేవలం 45 శాతం, 55 శాతం, 60 శాతం పర్సంటేజీల సర్టిఫికెట్లను మంజూరు చేసి అన్యాయం చేసిన డాక్టర్ల పైన చట్టపరంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అర్హులైన దివ్యాంగులకు 15 వేల రూపాయలు సెప్టెంబర్ నెల నుంచి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని తాము డిమాండ్ చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా దివ్యాంగులకు బ్యాంకు రుణాలను మంజూరు చేయాలని, గృహ వసతి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అయూబ్ కాన్, ఎస్ హెచ్ భాష, నిజాముద్దీన్, ఆదినారాయణ, అంజనేయులు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా జయంతి వేడుకలు

విశాలాంధ్ర-పామిడి: పట్టణంలోని క్రిస్టియన్ మైనార్టీలు మంగళవారం మదర్ థెరిస్సా జయంత్ సందర్భంగా పామిడి క్రిస్టియన్స్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు పాలు వైద్యాధికారి శివకార్తీక్ రెడ్డి నేతృత్వంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరదేశి.అనిల్ కుమార్ రాజా, వి.బుజ్జిబాబు,శివ, వెంకట్, వై.పి. బాబు, ఫీటర్ విజయ్, జిల్లా వై సీపీ సెల్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహామ్,జాకబ్, వీరన్న ప్రసాద్ పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: రంగులు, రసాయనాలతో తయారు చేసిన వినాయక ప్రతిమలను నీటిలో నిమజ్జనం చేయడంతో జల కాలుష్యం ఏర్పడుతుందని, దీంతో పర్యావరణ పరిరక్షణకు ముప్పు వాటిల్లుతుందని మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ఉరవకొండ తాసిల్దార్ మహబూబ్ బాషా తెలిపారు. మంగళవారం స్థానిక జై కిషన్ ఫౌండేషన్ ఫర్టిలైజర్ షాపు వద్ద ఉచితంగా మట్టి వినాయకులను పంపిణీ చేశారు. జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు పాల్గొన్నారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: వినాయక విగ్రహాలను సంప్రదాయక మట్టితో చేసినవి పూజ, ఉత్సవాలకు ఉపయోగించాలని ప్రధానోపాధ్యాయురాలు పద్మ తెలిపారు. మంగళవారం దర్గా హొన్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలి పారు. వినాయక చవితి ఉత్సవాలకు మట్టి వినాయక విగ్రహాలు ఉపయోగించి పర్యావరణ పరిరక్షణకు బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దీప, బహేశ్వర్, ఇబ్రహీం, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినీ ,విద్యార్థులు పాల్గొన్నారు.

పగటి వెలుగులు నియంత్రించండి

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ, బందూరు, తదితర గ్రామాల్లోని విద్యుత్తు స్తంభాలకు వీధి దీపాలు ఏర్పాటు చేశారు .వీధి దీపాలురాత్రి, పగలు తేడా లేకుండా నిత్యం వెలుగుతున్నాయి. దీంతో గ్రామ పంచాయతీకి అధికంగా బిల్లులు రావ డంతో పాటు బల్బులు వేగంగా పాడయ్యే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు. రాత్రి మాత్రమే వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్పందించు సహాయం అందించు..

విశాలాంధ్ర-కణేకల్లు: మండల పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీ యెర్రగుంట గ్రామ అంబేద్కర్ దళిత కాలనీ యందు సంఘం పాఠశాలలో స్పందించు సాయమందించు కార్యక్రమంలో భాగంగా ఆర్డిటి సంస్థ ఏటీఎల్ వెంకటేశులు,సివో,హనుమంత రాయుడు.గ్రామ సర్పంచ్ మన్నూరమ్మ ఆధ్వర్యంలో సేవా హుండీలను సంఘ సభ్యులందరికీ పంపిణీ చేశారు. ఏటిఎల్ వెంకటేసులు మాట్లాడుతూ మానవసేవయే మాధవ సేవ అని హుండీ ద్వారా కొంత పొదుపు చేసుకొని సంవత్సరానికి ఒకసారి ఫాదర్ ఫెర్రర్ జయంతి రోజున తమవంతు చందాగా అనాధ పిల్లల చదువుల కోసం సహాయం చేయాలని చెప్పారు. సంస్థ చేసే అభివృద్ధి కార్యక్రమాలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని చెప్పారు.

విఘ్నరాజాయా.. పత్రరూపాయా

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని దర్గా హొన్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 'పర్యావరణ హిత వినాయక చవితి'పై అవగాహన కార్యక్రమం జరిగింది. 8వతరగతి విద్యార్థిని కేదారేశ్వరి తమలపాకులతో తయారు చేసిన వినాయకుడి రూపం ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు, విద్యార్థినిని అభినందించారు.

పంటల బీమాకు గడువు తేదీ 30

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ బుదగవి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణుడు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సలహాలు సూచనలు చేశారు. బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించడానికి ఈనెల 30 వరకు అవకాశం ఉందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అనుమతి లేని ఎరువులు అమ్మితే చర్యలు

విశాలాంధ్ర-ముదిగుబ్బ: మండలంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ పోలీస్ శాఖలు మంగళవారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. షాపులలోని లైసెన్సులను, స్టాకు రిజిస్టర్లను, బిల్లు బుక్కులను పరిశీలించారు. ఎరువుల విక్రయాలను ఎప్పటికప్పుడు ఈ పోస్ మిషన్ల ద్వారా అప్డేట్ చేయాలని తెలిపారు. అనుమతి లేని ఎరువులను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెండు ఎరువుల షాపుల్లో స్టాకు వ్యత్యాసం కారణంగా రూ.17,84,210 విలువ చేసే ఎరువుల విక్రయాలను నిలిపివేశారు. కార్యక్రమంలో కదిరి ఏడీఏ సనావుల్లా, ముదిగుబ్బ తహసీల్దార్ నారాయణస్వామి, వ్యవసాయ అధికారి రవీంద్ర పాల్గొన్నారు.

గుండెపోటుతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

విశాలాంధ్ర-కూడేరు : ఉదిరిపికొండ గ్రామంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న చాకలి రాజశేఖర్(23) మంగళవారం వేకువజామున గుండెపోటుతో మృతి చెందాడు. ఇతనికి భార్య గౌతమి కూతురు ధరణి (4 సంలు), కుమారుడు పవన్ (ఏడాది వయస్సు) ఉన్నది. గ్రామంలో మంచి వ్యక్తిగా గుర్తింపు పొందడమే కాకుండా ఉపాధిహామీ పథకంలో కూడా ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తూ తలలో నాలుకలాగా మెదేలేవాడు. ఎంతో ఉత్సాహంగా కనిపించే వ్యక్తి రాత్రి 12 గంటల సమయంలో గుండె నొప్పిగా ఉందని బాధపడుతూ ఉండడం చూసి భార్య స్నేహితులు అనంతపురం ప్రభుత్వఆసుపత్రికి తీసుకొని వెళ్లారు. ఆసుపత్రిలో డాక్టర్ మార్గమధ్యలోనే ప్రాణాలు వదిలినట్లు నిర్ధారించారు. భార్య రోదనలు చూసిన వారు, బంధుమిత్రులు శోకసముద్రం లో మునిగిపోయారు.